క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్, కాలేజీలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 40, బీపీసీలో 40, సీఈసీలో 40, ఎంఈసీలో 40 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతిలో సాధించిన మెరిట్, రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుందని, ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈ నెల 26న ప్రకటిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్‌లో ఆదివారం పెద్దాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పరికిరాల వాసు, కక్కెర్ల రాజు, రవి, మాజీ వైస్ ఎంపీపీ సాంబయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ స్వామి పాల్గొన్నారు.

వెల్లంపల్లిలో చలివేంద్రం



పరకాల : ముదురుతున్న ఎండల కారణంగా రోడ్లపైకి చేరుకుంటున్న పరిస్థితుల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని వెల్లంపల్లి మాజీ సర్పంచ్ కృష్ణ కోరారు. మండలంలోని వెల్లంపల్లిలో జైభీమ్ యూత్ సొసైటీ అధ్యక్షుడు బొట్ల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రహదారుల వెంట వెళ్తున్న బాటసారులకు, వాహనాదారులకు వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం వలన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పెండెల మల్లయ్య, కార్యదర్శి ప్రమోద్, కాకి శరత్, మచ్చ చందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రావణ్‌కుమార్



శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన దాసి శ్రావణ్‌కుమార్‌ను బీఆర్‌ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి ఆదివారం ప్రకటించారు. తన నియమకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి, మాజీ జెడ్పీచైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువతి అదృశ్యం

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఓ యువతి (22) అదృశ్యమైనట్లు యువతి తండ్రి ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తమ కుమార్తె తిరిగి రాలేదని ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. నెక్కొండ మండలం సాయిరెడ్డి పల్లెకు చెందిన యువకుడు కర్దురి రాజవర్ధన్‌పై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేశాడు. స్థానిక ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మేమెంతో.. మాకంతా కావాలి



హన్మకొండ: రాష్ట్రంలోనే అధిక జనాభా ఉన్న కులం ముదిరాజ్ కులమని, తమకు రిజర్వేషన్ ఫలాలు, రాజ్యాధికారంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్ ముదిరాజ్ అన్నారు. మేడారంలో చేపట్టిన ముదిరాజ్‌ల ఆత్మగౌరవ యాత్ర మేడారం నుంచి ములుగు, నల్లబెల్లి, నర్సంపేట మీదుగా 15వ రోజు ఆదివారం వరంగల్, హనుమకొండకు చేరుకుంది. ఈమేరకు హనుమకొండలోని తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల ఆత్మగౌరవం కోసం పాదయాత్ర చేపటినట్లు గుర్తుచేశారు.

కోతులు బాబోయ్.. కోతులు

- ధాన్యం కల్లాలు, ఇళ్లలో చొరబడి ఆగమాగం చేస్తున్న వానరాలు
- బెంబేలెత్తుతున్న ప్రజానీకం
- పట్టించుకోని అధికారులు, నాయకులు



ధాన్యం కల్లం వద్ద కోతుల సమూహం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో కోతుల బెడద రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఇళ్లలో చొరబడి ఏది దొరికితే అది ఎత్తుకెళ్లి నానా హంగామా విధ్వంసం సృష్టిస్తున్నాయి. చూ..అంటూ అడ్డు వెళ్లితే మీద ఎగబడి కరుస్తూ తీవ్రంగా గాయపరుసున్న సంఘటనలు నెలకొన్నాయి. దీంతో స్థానిక ప్రజలు రోడ్లు, వీధుల వెంబడి నడవాలంటేనే జంకుతున్నారు. పదుల సంఖ్యలో ఉన్న కోతులు ప్రస్తుతం వందల సంఖ్యకు చేరుకున్నాయి. గుంపుగా వస్తూ ఇంటి తలుపులు తీసుకొని ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ఇండ్లలోని వస్తువులు కూరగాయలు, బియ్యం పప్పులు ఏది ఉంటే అది ఎత్తుకెళ్తున్నాయి. బియ్యం బస్తాలు, వడ్ల బస్తాలను ఆగమాగం చేస్తున్నాయి. గతంలో మాజీ ఎంపీటీసీ కోతుల బెడుద అధికంగా ఉందని గ్రామస్తుల కోరిక మేరకు ఆయన తన సొంత ఖర్చులతో కోతులను పట్టించారు. అయినప్పటికీ తిరిగి వాటి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఎక్కడ ధాన్యం ఆరబోసిన అక్కడికి గుంపులుగా చేరి ఆరబోసిన ధాన్యాన్ని బుక్కడంతో పాటు చిందరవందర చేస్తూ ఆగమాగం చేస్తున్నాయి. దీంతో రైతులకు కష్టాలు తప్పడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు, నాయకులు

కొంతకాలంగా మండల కేంద్రంలో కోతుల సంచారం విపరీతంగా పెరిగిపోయింది. స్థానిక ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఇళ్లలో నుంచి బయటకు వెళ్లేటప్పుడు చేతిలో కర్రలు పట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుందని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇళ్లపైకి చేరి పెంకలు విప్పి పగలగొడుతున్నాయి. వీధుల గుండా నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధులపైకి దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. జనం రోడ్లపైకి రావాలంటేనే తీవ్ర భయాందోళనకు గువుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ప్రజలను తీవ్రంగా గాయపరుస్తున్న వానరసైన్యాన్ని పట్టించి వాటి నుంచి నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్



మాట్లాడుతున్న అజీజ్‌ఖాన్

వేలేరు; విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో డీవైఎస్ఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్‌కు, సోషల్ మీడియాకు బానిస కాకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల సారంగపాణి, కోశాధికారి బిన్ని లక్ష్మణ్, నెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు కందుల సృజన్ కాంత్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి సద్దాం హుస్సేన్, ఫిజికల్ డైరక్టర్లు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు 11 నంబర్లతో విశిష్ట సంఖ్య

ధర్మసాగర్ : ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లు గానే ప్రతి రైతుకు 11 నంబర్లతో విశిష్ట సంఖ్య (యూనిక్ కోడ్)ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టడం జరుగుతుందని ఏఓ రాజేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఇ ఫార్మర్ రిజిస్ట్రీ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్ ఇ ఫార్మర్ ఐడీని కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు ఏ రకమైన చట్టబద్ధ యాజమాన్య హక్కును కల్పించదు. కేవలం రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని ఇ రైతు ఫార్మర్ ఐడీ కేటాయించబడుతందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయడం జరుగుతుందని, పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందుటకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని వెల్లడించారు. రైతు విశిష్ట సంఖ్యను(ఫార్మర్ ఐడీ) పొందుటకు మీ ఆధార్, భూమి పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ చేయబడిన మొబైల్ నెంబర్ తీసుకొని సమీపంలోని వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

వరంగల్ శ్రీనివాస్‌కు గద్దర్ ఐకాన్ అవార్డు ప్రదానం



గద్దర్ ఐకాన్ అవార్డు అందుకుంటున్న వరంగల్ శ్రీనివాస్

దామెర : మండలంలోని తక్కళ్లపహాడ్‌కు చెందిన ప్రముఖ కవి, రచయిత, గాయకుడు, సినీసంగీత దర్శకుడు వరంగల్ శ్రీనివాస్‌కు గద్దర్ ఐకాన్ అవార్డుతో సత్కరించారు. సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా వరంగల్ శ్రీనివాస్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 243 చరణాలతో తాను రాసిన నూరేళ్ల నా ఊరు గేయ కావ్యం 243 మంది గాయకులతో పాడించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కళాకారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కర్రెగుట్టల్లో నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి అటవీ ప్రాంతంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని రాష్ట్ర కళాకారుల పక్షాన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి ఖండించడంతో పాటు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో టూరిజం చైర్మన్ రమేష్ రెడ్డి, మాజీ మంత్రులు పట్నం మహేందర్ రెడ్డి, వేణుగోపాల చారిలతో పాటు పలువురు కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అరటి తోట దగ్ధం



ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో ఓ రైతు తన అరటి తోట దగ్ధమైనట్లు తెలిపాడు. బాధితుడు కడుదుల దేవేందర్ కథనం ప్రకారం .. పెద్దాపూర్ గ్రామ శివారులో 2 ఎకరాల భూమి ఉండగా అందులో అరటి తోట పెట్టాడు. కాగా అరటి తోట పక్కన పేరుపెల్లి రవీందర్‌కు మొక్కజొన్న చేను ఉండగా శనివారం అట్టి చేనుకు నిప్పంటించగా మంటలు చెలరేగి సమీపంలో ఉన్న అరటి తోటలో అరటి మొక్కలు దగ్ధమయ్యాయని తెలిపారు. రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మొరం తవ్వకాలు చేపట్టొద్దు



పత్తిపాకలో అభిప్రాయాలను సేకరిస్తున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో మొరం తవ్వకాలు చేపట్టొద్దని జరిపితే అడ్డుకుంటామని గ్రామస్తులు హెచ్చరించారు. ఆదివారం సీఐ రంజిత్‌రావు, ఎస్సై జక్కుల పరమేశ్ గ్రామస్తుల ఫిర్యాదుతో చేపల చెరువు కోసం తవ్వకాలు జరిపే పొలాన్ని పరిశీలించారు. భారీ వాహనాల రాకపోకల వల్ల సీసీ రోడ్లు దెబ్బతినడమే కాకుండా నల్లా పైపులైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చేపల చెరువు పేరిట ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని మొరం తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు సీసీ రోడ్డుపై పిల్లలు తిరుగుతుంటారని, భారీ వాహనాలు నడవడం వల్ల దుమ్ము, దూళి లేస్తుందని ప్రతి రోజు రోడ్డుపై నీళ్లు చల్లాలని, నల్లా పైపులైన్లు దెబ్బతినకుండా చూసుకోవాలని గ్రామస్తులు పోలీస్ అధికారులకు తెలిపారు. గ్రామస్తుల అభిప్రాయాలు తెలుసుకొని మొరం తవ్వకాలు జరిపే పొలంను పోలీసులు పరిశీలించి వెళ్లిపోయారు.

వెలమ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి

హన్మకొండ చౌరస్తా: వెలమ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని ఏఆర్ఆర్ గార్డెన్‌లో వెలమ సంక్షేమ సంఘం 30వ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పేరాల మధుసూదన్ రావు, కాకులమర్రి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే సత్యనారాయణ రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తామందరం ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సంఘం బలోపేతం చేస్తూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా పలు కార్యక్రమాలు చేసుకుందామని అన్నారు.

కార్మికులను బానిసలుగా మార్చేందుకు కుట్ర

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

వరంగల్: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం.. కార్మికులను కట్టు బానిసలుగా చేసేందుకే నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నిర్మాణ జనరల్ బాడీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ అధ్యక్షతన పోచమ్మమైదాన్‌లోని విస్‌డమ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడమే కాకుండా, గతంలో ఉన్న రోజుకు 8గంటల పనిదినాలను తీసివేసి 12 గంటల పని దినాలుగా మార్చాలని చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ మాట్లాడుతూ నేడు భారత కార్మిక వర్గం సంక్షోభంలోకి నెట్టివేయబడిందని వాపోయారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగుల రంజిత్ తదితరులు మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగుల దయాకర్, ఉపాధ్యక్షులుగా సీహెచ్.నర్సింగం, బరిగెల కుమార్ ప్రధాన కార్యదర్శిగా ఎలకంటి రాజేందర్, సహాయ కార్యదర్శులుగా బండి కుమార్, బన్న నర్సింగం, కోశాధికారిగా గొర్రె ప్రదీప్‌తోపాటు 15 మంది జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా రమేశ్



సంగెం : మండలంలోని ఎల్గూర్ స్టేషన్ గ్రామపంచాయతీ పరిధిలోని దుర్గమ్మ, హనుమాన్, పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ రమేశ్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా జీజుల సమ్మయ్య, ఉపాధ్యక్షుడుగా మోహన్, కన్వీనర్‌గా రమేశ్, కో-కన్వీనర్ మహేందర్, కోశాధికారిగా వెంకన్న, ఆర్గనైజర్‌గా శాఖపురి రత్నాకర్, కల్చరల్ కమిటీ సభ్యులుగా ప్రవీణ్, మురళీ, వీరన్న, వెంకన్న, సురేందర్, వెంకటేశ్, హరిలాల్, శివశంకర వరప్రసాద్, అనిల్, రాజు ఎన్నికయ్యారు.

జర్నలిజంలో విస్తృత అవకాశాలు

కేయూ క్యాంపస్: జర్నలిజం కోర్సు పూర్తిచేసిన వారికి మీడియాలో విస్తృత అవకాశాలున్నాయని కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్ అన్నారు. దూరవిద్యా కేంద్రంలో 2022 – 2024లో జర్నలిజం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సమాజంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు సామాజిక మాధ్యమాల విస్తృతి కారణంగా ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా క్షణాల్లో సమాజంలో అన్ని వర్గాలకు సమాచారం అందుతోందన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రజా సంబంధాల అధికారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ స్టాఫ్ ట్రెనింగ్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ, జర్నలిజం విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సంగని మల్లేశ్వర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జంక్షన్ పనులు వేగవంతం చేయాలి

- సుందరీకరణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



ఎల్కతుర్తి జంక్షన్ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రంలోని జంక్షన్, సుందరీకరణ పనుల్లో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్షన్ సుందరీకరణ పనుల్లో భాగంగా వాటర్ ఫౌంటేన్, గార్డెన్ గ్రీనరీ సెంట్రల్ లైటింగ్ సిస్టం హనుమకొండ వైపు గల ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు, జంక్షన్ నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు సుందరీకరణ పనులు కొనసాగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. పలు పనులపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి పరిశీలించారు. కార్యకర్తలు, అధికారులతో కలిసి అల్పాహారం చేసి పెండింగ్ పనులపై అధికారులతో ఆరా తీశారు. కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట నాయకులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సుకినె సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, మహేందర్, సుమన్, రమేష్, వెంకటేష్, సురేందర్, నవీన్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి
- గుండేడుకు రూ.10 లక్షల విరాళం అందజేత



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండేడులో ఆదివారం జరిగిన శివాలయం, మడేలయ్యస్వామి, పోచమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండేడు గ్రామ ప్రజలు, నాయకులు, అన్ని కులాల పెద్దలు పార్టీలకతీతంగా వచ్చి తమ గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేసి గ్రామ దేవాలయాల అభివృద్ధికి సాయం కోరగా స్పందించిన ఎమ్మెల్యే అభివృద్ధి కోసం రూ.10 లక్షల విరాళం ప్రకటించి గ్రామస్తుల సమక్షంలో ఆదివారం రూ.10 లక్షల చెక్కు అందజేశారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే చేయూతతో గ్రామ అభివృద్ధి వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని భీంపల్లిలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ బోనాలతో వెళ్తున్న గౌడ మహిళలు

కమలాపూర్ : శ్రీ రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో గౌడ కులస్తులు పోచమ్మ బోనాల వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గౌడ కులానికి చెందిన మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అక్కడ పోచమ్మ తల్లికి బోనాల నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుని తమ పిల్లా పాపలను చల్లగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పబ్బు ఎల్లాగౌడ్, ఉపాధ్యక్షుడు జక్కు ప్రభాకర్, కోశాధికారి పచ్చిమట్ల రాజేశ్ బాబు, డైరెక్టర్లు సమ్మయ్య, పెరుమాండ్ల భూపాల్, బాలసాని రవి, మండ రాజు, పబ్బు సది, జేరుపోతుల పుల్లయ్య, కారోబార్ కుమారస్వామి, గౌడ మహిళలు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

7 నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



ఆహ్వానపత్రాలు అందజేస్తున్న అర్చకులు

ఆత్మకూరు : మండలకేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 (బుధవారం) నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి తెలిపారు. 7న సాయంత్రం తొళ్లక్కంతో అధ్యయన బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, 8న ప్రాబోధకి, ప్రబంధసేవాకాలము ,9న ధ్వజారోహణం(గరుడముద్దలు), 10న ఉదయం హోమం సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం, 11న పూర్ణాహుతి, 12న వ్యాసపౌర్ణమి బండ్లు తిరుగుట జాతర జరుగుతుందని అర్చకులు వివరించారు. ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎల్కతుర్తి : బీసీ కుల, జనగణన చేపట్టేందుకు కేబినెట్‌లో ఆమోదం తెలిపిన సందర్భంగా ప్రధాని మోదీ చిత్రపటానికి ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని అంబేడ్కర్ చౌక్ వద్ద బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు మాట్లాడుతూ కేంద్ర కేబినెట్‌లో కులగణన చేపట్టేందుకు ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. 60 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏనాడు దేశంలో కులగణన చేపట్టలేదని విమర్శించారు. బీసీల హక్కులను కాలరాయడం, బీసీల హక్కులు, రిజర్వేషన్లు అణచివేయడం వారి నైజం అని విమర్శించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపెల్లి పృథ్వీరాజ్, నాయకులు ఊసకోయిల కిషన్, వేణు, రమేష్, సురేష్, సదానందం, అంబీర్ కవిత, సంపత్, రాణాప్రతాప్, వికాస్, వీరన్న, శ్యామ్, రాజేందర్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.